క్లుప్తంగా

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో కశ్మీర్‌లో పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. దాడుల్లో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని చేకూర్చాలని ప్రార్థనలు చేశారు. అలాగే గాయపడిన వారు త్వరిత గతిన కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. పలువురు పాస్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

8 నుంచి ఉచిత వాలీబాల్ శిక్షణ

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలోని ప్రతిభ గల క్రీడాకారులకు తూర్పుపాలెం అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే 8, 2025 నుంచి జూన్ 8, 2025 వరకు వాలీబాల్ క్రీడలో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్, కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సౌజన్యంతో జాతీయ వాలీబాల్ క్రీడాకారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల సహకారంతో 10 నుంచి 18 సంవత్సరాల బాలబాలికలకు శిక్షణ తరగతులను ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తారు. ఆసక్తి గల బాల బాలికలు మే 5 2025 లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబర్ 9392447443ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి వెంకటాయపాలేనికి చెందిన మేక సత్యనారాయణచౌదరి, జయభారతి దంపతులు సోమవారం రూ.12 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సంత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అలాగే తాడేపల్లిగూడునికి చెందిన గుండు నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళం అందజేశారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: పది పరీక్షల అనంతరం విద్యార్థుల కెరీర్ కోసం వారు ఎంచుకునే రంగాలకు అనుగుణంగా ఇచ్చే శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు, రాష్ట్ర పీఆర్‌టీయూ అధ్యక్షుడు సీహెచ్ రమేష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ సెంటర్ సోమవారంతో ముగిసింది. వారు మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన మెళకువలను విద్యార్థులు ఆకళింపు చేసుకుని విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెహరా మూర్తి, సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.


ఆదర్శనీయుడు అంబేడ్కర్



పాశర్లపూడిలంకలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆదర్శనీయుడని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. పాశర్లపూడిలంకలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ శిలా విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సభలో ఎమ్మెల్యే సత్యనారాయణ, కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడారు. అన్ని వర్గాలకు అవకాశాలు కల్పిస్తూ చక్కటి రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేడ్కర్ అని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ టి.సూర్యప్రకాశరావు, పి.గోపాల్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.11,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని రావులపాడుకి చెందిన గెడ్డం బాల (59) నోటి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఇప్పటి వరకూ రూ.2 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా ఖర్చు పెట్టే స్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాడులో గెడ్డం బాల ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.11,500 చెక్కు అందజేశారు.

పల్లెల్లో పనుల కరవు

- యంత్రాలతోనే రబీ సాగు
- ప్రారంభమైన రబీ మాసూళ్లు



వరికోత కోస్తున్న యంత్రం

రావులపాలెం: ఒకప్పుడు రెండో పంట మాసూళ్లంటేనే రెండు నెలలకు పైబడి సాగుతుండేవి. కోతలు, కట్టేతలు, కుప్పనూర్పిళ్లు, ధాన్యం ఎగరు బోతలు ఇలా రైతులు తీరుబడిగా రబీ పంట పనులు చేసుకుంటుండేవారు. కానీ ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ పుణ్యామాని మాసూళ్లు ప్రారంభమైన నెలలోపే రైతులు ధాన్యాన్ని అమ్మేసుకుని వచ్చిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. రెండో పంటలో రెండు నెలలకు పైగా పనులు చేసుకుని గ్రామాల్లో కూలీలు కూలీ డబ్బులు తెచ్చుకునే వారు. కానీ యంత్రాలతో మాసూళ్లు వచ్చిన తరువాత వారికి పనులు లేకుండా పోయాయి.

పెద్ద ఎత్తున వరి కోత యంత్రాల రాక

నియోజకవర్గంలో ఈ సారి రబీ మాసూళ్ల సీజన్ ప్రారంభంలోనే పెద్ద ఎత్తున వరి కోత యంత్రాలు వచ్చాయి. కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలతో పాటుగా ఏపీలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి కూడా వరి మాసూళ్ల యంత్రాలు వచ్చాయి. ఏటా నియోజకవర్గంలోని మండలాల్లో రెండో పంటలో 25,034 ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. ఆలమూరు 9 వేల ఎకరాలు, ఆత్రేయపురం 4,494 ఎకరాలు, రావులపాలెం 4,728 ఎకరాలు, కొత్తపేట 6,812 ఎకరాల్లో రబీ సాగు అవుతుంది. సాధారణంగా ఏప్రిల్ మొదటి వారంలో మాసూళ్లు ప్రారంభించి దాదాపుగా మే నెలాఖరు వరకు సాగేవి. ఈ సారి సాగునీటి ఎద్దడి కారణంగా ఏప్రిల్ రెండో వారంలో కోతలు ప్రారంభించారు. ప్రారంభం నాటి నుంచి యంత్రాలతోనే రైతులు మాసూళ్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని 57 గ్రామాల్లోని వరి పంట మాసూళ్లకు దాదాపుగా ఏటా 500 కి పైగా వరి కోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు. గతంలో కోతలు కోసి కుప్పలు నూర్చి ధాన్యాన్ని ఇంటికి తీసుకు వచ్చే సరికి ఒక ఎకరానికి రైతుకు సుమారుగా కూలీ రేట్లను బట్టి రూ.10 వేల నుంచి 15 వేల వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం యంత్రాలతో మాసూళ్లు చేస్తుండటంతో ఆ ఖర్చు తగ్గిందనే చెప్పాలి. ఎకరానికి యంత్రాల ద్వారా మాసూళ్లకు దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.8500 వరకు ఖర్చవుతుంది. గత ఏడాది వరి కోత యంత్రానికి ఎకరానికి గంటకు రూ.2500 నుంచి రూ.2600గా తీసుకునేవారు. కాగా ఈ సారి రూ.2800 నుంచి రూ.3000కు పెంచేశారు. గ్రామాల్లో కూలీ పనులు చేసుకుని బతికే వారికి యంత్రాలు వచ్చి గండి కొట్టాయి. దాదాపుగా రెండు నెలల పాటు వ్యవసాయ పనులు చేసుకునే వారు. సీజన్ ప్రారంభంలో ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.800 వరకు రోజు కూలీ దక్కేది. ప్రస్తుతం కోతలు, కుప్పనూర్పిళ్లు లేకపోవటంతో కూలీలకు పనులు కరువయ్యాయి. కేవలం యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని ఎండబెట్టుకునేందుకే కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుంది. అదీ ఎకరానికి ఇద్దరు కూలీలు రెండు రోజులు పాటు మాత్రమే ధాన్యాన్ని ఎండబెట్టేందుకు పనిచేస్తున్నారు. ఏటా వరికోత యంత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పనులు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో కూలీలు ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సి వస్తుంది.

తొంభై శాతానికి పైగా యంత్రాలతోనే..



ఈ సారి నియోజకవర్గానికి పెద్ద ఎత్తును యంత్రాలు తరలివచ్చాయి. దీంతో పనులు త్వరగా అయిపోయి, రబీలో అనుకున్న విధంగా దిగుబడి రాకపోవటం, గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో తగ్గిన మాసూళ్ల ఖర్చులు కొంతలో కొంత కలసి వచ్చినట్లే..

– మట్టా పోలయ్య, రైతు, ఈతకోట

ఏటా పనులు తగ్గుతున్నాయి



యంత్రాలు రావడంతో రెండో పంటలో ఏటా పనులు తగ్గుతూనే వస్తున్నాయి. ఇరవై రోజుల్లో మొత్తం పనులు పూర్తయిపోతున్నాయి. కూలీల్లో సగానికి పైగా పనులు ఉండటం లేదు. దీంతో వేరే మార్గాల్లో పనులు చూసుకోవాల్సి వస్తుంది.

– మట్టా దుర్గారావు, రైతు, ఈతకోట

రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఆలమూరులో పినపళ్ల సర్పంచ్, కార్యదర్శులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: ఇటీవల రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు సాధించిన సర్పంచ్ సంగిత సుభాష్, గ్రామ కార్యదర్శి ఎస్.వీర్రాజుకు ఘన సత్కారం జరిగింది. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర స్థాయిలో అవార్డులను సాధించి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ పేరు ప్రఖ్యాతులు సాధించిన పంచాయతీ పాలకవర్గ సభ్యులను వారు అభినందించారు. అనంతరం సర్పంచ్, కార్యదర్శులకు దుశ్శాలువా వేసి పూలమాలలు, మెమెంటోతో సత్కరించారు. తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, వెటర్నరీ ఏడీ ఎల్.అనిత, మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీలావణ్య, సూపరింటెండెంట్ ఎంఎం ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పి.పద్మ, ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్వీ సుబ్బరాజు, హౌసింగ్ జేఈ దరణాల శ్రీనివాసు, ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీ జి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవార్ల జాతరలు



కనకమహాలక్ష్మి

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, భారీ బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం, పూజఘటం ఊరేగింపు నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లిస్తారని, బుధవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ తులా నాగరాజు తెలిపారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



మహాలక్ష్మి అమ్మవారు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు వివిధ ఏర్పాట్లు నిర్వహించారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా గత 15 రోజుల నుంచి అమ్మవారికి గ్రామస్తుల ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఆధ్వర్యం వహించారు. గ్రామానికి చెందిన అంబటి దుర్గారావు ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎటువంటి వివాదాలు జరుగకుండా పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన నూకాలమ్మ తీర్థ మహోత్సవాలు

మలికిపురం: గత నెల రోజులుగా జరుగుతున్న గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకుని దర్శనం చేసుకున్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అనేక గ్రామాల నుంచి భక్తులు వచ్చారు. నిర్వాహక కమిటీ తరపున సుందర బ్రహ్మయ్య మాట్లాడుతూ తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తుల అన్నసమారాధనకు ఆర్థిక సహాయం చేసిన శ్రీకృష్ణ యాదవ సంఘానికి, గాంధీబొమ్మ సెంటర్ నివాసి తోరం కిషోర్ బ్రదర్స్‌కి, సుందర వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఉత్సవాల చివరి రోజున ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ కోతలతో ప్రజలకు వెతలు

ఆలమూరు: విద్యుత్ చార్జీలను మూడింతల రెట్లు వసూలు చేస్తున్న విద్యుత్ శాఖ సరఫరాలో కూడా పూర్తి నిర్లక్ష్యం వహిస్తుంది. ఆదాయంపై ఉన్న శ్రద్ధ సరఫరాలో లేకపోవడం ప్రజలకు శాపంగా పరిణమించింది. రేయింబవళ్లు విద్యుత్ కోతలకు ఆలమూరు మండలంలోని అనేక గ్రామాలు విలవిలలాడుతున్నాయి. అనధికార కోతల వల్ల ఏ సమయంలో విద్యుత్ నిలిచిపోతుందో, మరెప్పుడు వస్తుందోనని వినియోగదారులు ఎదురుచూడటం తప్ప చేసేదేమీ లేకుండా పోతుంది. ఆదివారం రాత్రి నుంచి ఉదయం వరకూ సుమారు 30 సార్లు ప్రతి అర గంట, గంటకు విద్యుత్ సరఫరా నిలిచిపోతూనే ఉంది. మండలంలో అనేక చోట్ల డబ్బా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా పునరుద్ధరణ జరగడం లేదు. దీంతో వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో వాడకం పెరిగి తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ సరఫరా అంతరాయానికి అధిక వినియోగం కూడా ఒక కారణంగా భావించినా ఆ దిశగా పరిష్కారానికి ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ డీఎంకె దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా మండపేట మండలంలోని ఏడిదలోని 33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఆలమూరు సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సమస్య వల్ల ఈ అంతరాయం ఏర్పడిందన్నారు. మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాల్లో ఏర్పడిన విద్యుత్ సమస్యను స్థానిక లైన్‌మన్లు మండపేట మండలంలోని ఏడిద కొత్తూరులో గుర్తించారు. ఏడిద సమీపంలో ఏర్పడిన సమస్యను సాధారణంగా అక్కడి సిబ్బంది పరిష్కరించవలసి ఉన్నా పట్టించుకోకపోవడంతో రాత్రి నుంచి ఉదయం వరకూ మండల వాసులు ఇబ్బందులు పడవలసి వచ్చింది. దీనిపై వినియోగదారుల నుంచి ఒత్తిడి తీవ్రతరం కావడంతో స్థానిక లైన్‌మన్లు 33 కేవీ విద్యుత్ లైన్‌ను తనిఖీ చేసుకుంటూ వెళ్లి ఏడిద కొత్తూరులో గుర్తించి సమస్య పరిష్కరించారు. దీంతో సోమవారం మధ్యాహ్నం సమయంలో విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో జరిగింది.

కార్మిక చట్ట నిబంధనలు పాటించడం తప్పనిసరి



ఆలమూరులో కార్మిక చట్టం అమలుపై చర్చిస్తున్న ఇటుక బట్టీ యజమానులు

ఆలమూరు: కార్మికుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక చట్ట నిబంధనలు పాటించడం తప్పనిసరని మండపేట సహాయ కార్మిక అధికారి కెఎస్.నాగ మల్లేశ్వరరావు అన్నారు. ఆలమూరులోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో సోమవారం స్థానిక ఇటుక బట్టీ యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఇటుక బట్టీ సమాఖ్య అధ్యక్షుడు, డాక్టర్ చల్లా ప్రభాకరరావు, గౌరవ అధ్యక్షుడు రామానుజుల శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఆధ్వర్యంలో వివిధ గ్రామాల బట్టి యజమానులు హాజరయ్యారు. ఇటుక బట్టీలో పనిచేసే ప్రతి కార్మికుడ్ని ఈ–శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని, ఏటా లైసెన్స్ పునరుద్ధరణ, నవీకరణ జరగాలని, కార్మిక సంక్షేమ నిధికి క్రమం తప్పకుండా రుసుం చెల్లించాలన్నారు. ఇటుక బట్టీల వద్ద తప్పనిసరిగా సంస్థ పేరు తెలిపే బోర్డును ఏర్పాటు చేయాలని నాగ మల్లేశ్వరరావు వివరించారు. ఆ బోర్డు తెలుగులో ఉండాలన్నారు. కార్మిక చట్టంపై ఏమైనా అపోహలుంటే సత్వరమే కార్మికశాఖను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డెంగీ, మలేరియా లక్షణాలు కలిగి ఉన్నవారిని గుర్తించి వారి వివరాలను సేకరించడంతో పాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాగే ఇంటింటా జ్వర పీడితుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అంతకుముందు ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి ఎస్వీ రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భరోసాతో మత్స్యకారులకు ఎంతో మేలు



పి.గన్నవరంలో డొక్కా సీతమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: వేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 వేల వంతున ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యానారాయణ అన్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లిలో సోమవారం జిల్లా అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు ఆధ్వర్యంలో మోదీ, చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు మత్స్యకారులు క్షీరాభిషేకం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శేరు చినసత్యనారాయణ, తిరుపతి రావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, దాసరి వీవీ సత్యనారాయన, బొంతు పెద బాబు, సాధనాల జేడీ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ సేవలు చిరస్మరణీయం

నిరతాన్నదాత్రి డొక్కా సీతమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. సీతమ్మ వారి వర్ధంతి సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో ఆమె విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తాటికాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు



రాజోలులో శిక్షణ తరగతులకు హాజరైన చిన్నారులు

మలికిపురం: మలికిపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి బి.నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యూపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అడబాల వీవీ సత్యనారాయణ మూర్తి, సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విజ్ఞాన తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలని అలాగే గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ రహీం, ఎం.సాంబశివరావు, ఎస్.విజయబాబు, జె.రక్షక్‌కుమార్ సీహెచ్ కళ్యాణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి కుడిపూడి పద్మజ తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో సర్వస్వతీ దేవి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. జూన్ 6వ తేదీ వరకు చిన్నారులకు డ్రాయింగ్, పాటలు, క్యారమ్స్, నృత్యాలు, క్రాఫ్ట్, ఇంగ్లీషు చదివించడం, కథలు చదివించడం, చెప్పించడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. న్యాయవాది ధరణీప్రగడ వంశీకృష్ణ, శృంగవరపు వరప్రసాద్, సీహెచ్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి



ఆత్రేయపురం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అన్నపూర్ణ

కొత్తపేట: ఆత్రేయపురం మండలంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అందరం సమష్టిగా కృషి చేద్దామని ఆత్రేయపురం ఎంపీపీ కుండ అన్నపూర్ణ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీపీ అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు పలువురు సభ్యులు వివిధ సమస్యలు ప్రస్తావించారు. మరికొన్ని సమస్యల విషయంలో అధికారుల ఉదాసీన వైఖరిని ప్రశ్నిస్తూ వారిని నిలదీశారు. ముఖ్యంగా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై ప్రశ్నించారు. పండించిన ధాన్యం విక్రయించేందుకు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రస్తుత కాలువలు కట్టుబడి సీజన్‌లో లొల్ల లాకులు ఆధునీకరణ చేపట్టాలని కోరారు. ప్రస్తుతం విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సమస్యలు వలన గ్రామాల్లో తాగునీరు సరఫరాకు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో తాగు నీరు ఎద్దడి తలెత్తకుండా అదనపు ట్యాంకులు నిర్మించాలని కోరారు. గ్రామాల్లో అనేకమంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారని, గృహ నిర్మాణ పథకం వెంటనే అమలు చేయాలని కోరారు. ఇరిగేషన్ కాలువ గట్లు, డ్రైన్‌గట్లపై ఆక్రమణలను ఆదిలోనే అడ్డుకోవాలని సూచించారు. డ్రైన్ల ఆధునీకరణ చేపట్టాలని, పీఎం సూర్యఘర్ పథకాన్ని వేగవంతంగా అమలు చేయాలని కోరారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలకు, వివిధ అంశాలకు సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ పి.బంగార్రాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు ఫ్రీజర్ బహూకరణ



శ్మశానవాటికకు ఫ్రీజర్‌ను బహూకరించిన దాతలు

ఆలమూరు: మండలంలోని జొన్నాడ గౌతమి బ్రిడ్జి వద్ద ఉన్న శ్మశానవాటికకు ఫ్రీజర్ బహూకరణ జరిగింది. ఆలమూరుకు చెందిన వెత్సా నరసింహమూర్తి–లక్ష్మీసూర్యకాంతం జ్ఞాపకార్థం కుమారుడు వెత్సా సురేష్ కుమార్, రాధిక దంపతులు రూ.1.05 లక్షల విలువైన ఫ్రీజర్‌ను కొనుగోలు చేశారు. ఈ ఫ్రీజర్‌ను గ్రామానికి చెందిన నామాల వెంకట్రావు చేతుల మీదుగా ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. మండల పరిసర ప్రాంతాల్లో మృతి చెందిన వారి ఇంట్లోని బంధువులు వచ్చే వరకు ఫ్రీజర్‌లో భద్రపరచడానికి వీలు కలుగుతుందనే ఉద్దేశంతో ఈ ఫ్రీజర్ బహూకరించినట్లు దాతలు తెలిపారు,

విజేత సువర్ణపేట క్రికెట్ జట్టు

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల నిర్వహించిన అండర్ 19 విభాగం క్రికెట్ టోర్నమెంట్ విజేతగా స్థానిక సువర్ణపేట జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో జయపేట జట్టు నిలిచింది. లూథరన్ చర్చి పరిధిలోని తొమ్మిది పేటల క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. నిర్వాహకులు సోమవారం బహుమతి ప్రదానోత్సవం ఏర్పాటు చేశారు. స్థానిక జనసేన నాయకుడు బందెల శరత్‌రాయ్, మొదటి స్థానంలో నిలిచే జట్టుకు నగదు బహుమతి రూ.5 వేలు స్పాన్సర్ చేసి, సదరు మొత్తాన్ని సువర్ణపేట జట్టుకు అందజేశారు. తోటి సురేష్, మేడిద శ్రీదర్, జిల్లెళ్ళ బిట్టు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



రిలే దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాజోలు: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజోలు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాజోలు డిపో అధ్యక్షుడు సీహెచ్ బాబు, కార్యదర్శి ఎస్ఎస్ వాసుల ఆధ్వర్యంలో డ్రైవర్లు సీహెచ్ సాహెబ్, ఎన్.అన్నవరం, జి.ప్రేమ్‌కుమార్‌లు దీక్షల్లో కూర్చున్నారు. రెండు రోజుల పాటు నిరసన దీక్షలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. ఉద్యోగుల భద్రతా సర్క్యులర్‌ను అన్ని డిపోల్లో అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని కోరారు.

కేంద్రం చొరవతో ఎంతో మందికి ఉపాధి

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతో మంది కార్మికులకు ఉపాధి లభిస్తోందని బీజేపీ మండల శాఖ అధ్యక్షులు బైరిశెట్టి దుర్గారామకృష్ణ తెలిపారు. లూటుకుర్రులో ఉపాధి నిధులు రూ.11 లక్షలతో చేపట్టిన గ్రామ పంచాయతీ చెరువుల అభివృద్ధి పనులను బీజేపీ బృందం సోమవారం పరిశీలించింది. ఈ పనుల ద్వారా నాలుగు గ్రామాల కూలీలకు ఉపాధి కలుగుతుందన్నారు. ఉపాధి హామీ ద్వారా ఏటా లక్షలాది మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన షిర్డీ సాయి, సత్య సాయిబాబా ఆలయం 14వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి 11 మంది పుణ్య దంపతులతో 121 లీటర్ల ఆవుపాలతో శ్వేత్యార్క సుగంధ పరిమళ జలాలు, వైనతేయ నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అన్నసమారాధన జరిగింది.

ఆహార పొట్లాల పంపిణీ

పి.గన్నవరం: డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో సోమవారం ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక సీహెచ్‌సీలో పేషెంట్లకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, ఆహార నిధి సభ్యులు గట్టిం వీరు, పోలిశెట్టి పవన్ మహేష్, చీకట్ల కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా అబుతాలిబ్ జయంతి

మామిడికుదురు: నగరం గ్రామంలోని అజాఖానయే జహెరా పంజాలో ఆదివారం రాత్రి హజరత్ ఇమామ్ అలీ తండ్రి హజరత్ అబుతాలిబ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురుహే మొహిబ్బానే జహెరా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా మిలాద్ జరిగింది. కవులు తమ కవిత్వాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.